సాక్షి
జగిత్యాల

బుధవారం । 12 । ఏప్రిల్ । 2023



ముస్లింలకు ఇఫ్తార్

ధర్మపురి: డీసీసీ అధ్యక్షుడు అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ఆధ్వర్యంలో మంగళవారం మసీదులో ముస్లింలకు ఇఫ్తార్ ఏర్పాటు చేశారు.



బద్దిపోచమ్మకు బోనం

వేములవాడ: రాజన్నను దర్శించుకున్న భక్తులు మంగళవారం బద్దిపోచమ్మకు బోనం, పట్నాల మొక్కులు చెల్లించుకున్నారు.

గరిష్టం/కనిష్టం
39.0/26.0

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. పగటిపూట ఉక్కపోతగా ఉంటుంది. ఎండ తీవ్రత పెరిగే అవకాశం ఉంది.

ఆకలి గొన్న వానికి
కడుపు నింపడం
అత్యుత్తమ దానం
– మహ్మద్ ప్రవక్త

ఇఫ్తార్	సహర్
బుధ 6.35	గురు 4.35

రంజాన్ వేళలు

న్యూస్‌రీల్

సీఎమ్మార్ పూర్తిచేయండి



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ లత

జగిత్యాల: జిల్లాలోని రైస్‌మిల్లర్లు తమకు నిర్దేశించిన కస్టమ్ మిల్లింగ్ రైస్(సీఎమ్మార్)ను సత్వరమే పూర్తిచేయాలని అదనపు కలెక్టర్ లత ఆదేశించారు. మంగళవారం కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో జిల్లాలోని రా, బాయిల్డ్ రైస్‌మిల్లర్లతో 2021–22 యాసంగి, 2022–23 వానాకాలానికి సంబంధించి సీఎమ్మార్‌పై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. యాసంగి 2021–22 సీఎమ్మార్‌ను ఈనెల 30వ తేదీలోగా పూర్తిస్థాయిలో చెల్లించాలన్నారు. ఇప్పటివరకు 74 శాతం మాత్రమే సీఎమ్మార్ ఇచ్చారని తెలిపారు. మిల్లర్లు నిర్దేశిత సీఎమ్మార్ ఇవ్వాల్సిందేనని పేర్కొన్నారు. సమావేశంలో జిల్లా పౌర సరఫరాల అధికారి తదితరులు పాల్గొన్నారు.

నేటినుంచి 'డబుల్' ఇళ్ల దరఖాస్తులు స్వీకరణ

జగిత్యాల: మున్సిపల్ పరిధిలో నిర్మించిన డబుల్ బెడ్రూమ్ ఇళ్లకోసం అర్హులైనవారు దరఖాస్తు చేసుకోవాలని కలెక్టర్ యాస్మిన్ బాషా సూచించారు. ఈమేరకు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఈనెల 12 నుంచి 17వ తేదీ వరకు మీసేవా కేంద్రాల ద్వారా దరఖాస్తులు చేసుకోవాలని పేర్కొన్నారు. మున్సిపల్ పరిధిలో రేషన్, ఆధార్, ఓటరు గుర్తింపు కార్డులు, వ్యక్తిగత బ్యాంకు ఖాతాలు కలిగిఉన్న, ఇప్పటికీ ఇళ్లులేని, ఆస్తులులేని, నిరుపేదలు అర్హులని వివరించారు. ఆసక్తిగలవారు డబుల్ బెడ్రూమ్ ఇళ్ల కోసం తక్షణమే మీసేవా కేంద్రాల ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

ఆరోగ్య మహిళతో ప్రయోజనాలు



వైద్యసేవలు పరిశీలిస్తున్న సమియొద్దీన్

కథలాపూర్(వేములవాడ): మహిళలకు ప్రత్యేకంగా వైద్యసేవలందించే 'ఆరోగ్య మహిళ' కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని వైద్యశాఖ జిల్లా ప్రోగ్రామింగ్ ఆఫీసర్ ఎండీ సమియొద్దీన్ సూచించారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో చేపట్టిన ఆరోగ్య మహిళ కార్యక్రమాన్ని మంగళవారం ఆయన పరిశీలించారు. మహిళలకు అందిస్తున్న వైద్యం తీరుపై ఆరా తీశారు. జిల్లాలో ఐదు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లోనే ఆరోగ్య మహిళ కార్యక్రమం అమలు చేస్తున్నామని, అందరూ సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి సింధూజ, ఏపీఎం నరహరి, వైద్యసిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సైకాలజీ అసోసియేషన్ జిల్లా కార్యవర్గం ఎన్నిక



రఘునందన్

జగిత్యాలటౌన్: తెలంగాణ సైకాలజీ అసోసియేషన్(టీపీఏ) జిల్లా అధ్యక్షుడిగా కూర్మాచలం రఘునందన్ ఎన్నికయ్యారు. స్థానిక ధరూర్ క్యాంప్‌లో మంగళవారం జరిగిన కార్యక్రమంలో టీపీఏ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సంఘం గౌరవ అధ్యక్షుడిగా టి.గిరిధర్, ప్రధాన కార్యదర్శిగా జి.సురేశ్‌కుమార్, ఉపాధ్యక్షుడిగా అజీజ్ అహ్మద్, కార్యదర్శిగా అకుతోట జీవన్‌రెడ్డి ఎన్నికయ్యారు. అనంతరం జరిగిన సమావేశంలో అసోసియేషన్ అధ్యక్షుడు కూర్మాచలం రఘునందన్ మాట్లాడుతూ సమాజంలో వ్యక్తిత్వ వికాస నిపుణులు, సైకాలజిస్టుల కొరత ఎక్కువగా ఉందన్నారు. తద్వారా పలు రుగ్మతలతో బాధపడేవారిలో చైతన్యం తేవడంలో జాప్యమవుతోందని అన్నారు. దీంతోనే చాలామంది పలు రుగ్మతలతో బాధపడుతున్నారని తెలిపారు. ఇలాంటి వాటిని రూపుమాపేందుకు కృషి చేస్తామని అన్నారు. ఇందుకోసం అసోసియేషన్‌ను మరింత పటిష్టం చేస్తామని ఆయన తెలిపారు.

పల్లెకు డిజిటల్ సేవ



రేషన్‌కార్డుదారులకు బియ్యం పంపిణీ చేస్తున్న డీలర్(ఫైల్)

- రేషన్ దుకాణాల ద్వారా కార్యకలాపాలు
- కమీషన్ రూపంలో డీలర్లకు అదనపు ఆదాయం
- గ్రామీణుల దరికి మెరుగైన, నాణ్యమైన సేవలు
- ఆసక్తిచూపని డీలర్లు.. అవగాహన కల్పిస్తున్న అధికారులు

కథలాపూర్(వేములవాడ): జిల్లాలోని గ్రామీణ రేషన్ దుకాణాల ద్వారా బ్యాంక్, కామన్ సర్వీస్ సెంటర్ పౌర సేవలు అందించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు ఇండియన్ పోస్ట్ పేమెంట్ బ్యాంక్(ఐపీపీబీ)తో అనుసంధానమైంది. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారులు డీలర్లకు నెల క్రితమే ఈ విధానంపై అవగాహన కల్పించారు. అయితే, వారు పెద్దగా ఆసక్తి చూపడంలేదు. ఇప్పటివరకు 30 మంది డీలర్లు మాత్రమే బ్యాంకు సేవలు అందించేందుకు దరఖాస్తు చేసుకోవడం ఇందుకు అద్దంపడుతోంది.

డీలర్లకు ఆర్థిక తోడ్పాటు

- జిల్లాలో ఐదు మున్సిపాలిటీలు, 20 మండలాలు వాటి పరిధిలో 380 గ్రామాలు ఉన్నాయి. ఆయా పట్టణాలతోపాటు గ్రామీణులకు ప్రభుత్వం సరఫరా చేసే సరుకులు పంపిణీ చేసేందుకు 586 రేషన్ దుకాణాలు ఉన్నాయి. జిల్లా వ్యాప్తంగా 3.08 లక్షల రేషన్ కార్డులు ఉండగా 8,88,679 మంది లబ్ధిదారులు ఉన్నారు. ప్రస్తుతం రేషన్ షాపుల ద్వారా బియ్యం మాత్రమే పంపిణీ చేస్తున్నారు. తద్వారా డీలర్లకు ఆశించిన మేర కమీషన్ లభించడంలేదు. ఈ క్రమంలో వారికి ఆర్థిక తోడ్పాటు అందించడంతోపాటు బ్యాంక్ సేవలను ప్రజలకు మరింత చేరువ చేసేందుకు ప్రభుత్వం కొత్త విధానానికి శ్రీకారం చుట్టింది. ఈ సేవలు అందించినందుకు డీలర్లకు కమీషన్ రూపంలో ఆదాయం సమకూరేలా ప్రభుత్వం పకడ్బందీ చర్యలు తీసుకుంటోంది. దీనిద్వారా దరఖాస్తు చేసుకున్న డీలర్లకు బయోమెట్రిక్ యంత్ర పరికరం, ఆధార్ ఎనేబుల్డ్ పేమెంట్ సిస్టం అందించనున్నారు.

రేషన్ డీలర్లు అందించే సేవలు ఇవే..

- ప్రతినెలా లబ్ధిదారులు బియ్యం తీసుకునేందుకు రేషన్ డీలర్ల వద్దకు వస్తుంటారు.
- వీరికి బ్యాంక్ సేవలు, ఆర్థిక లావాదేవీలు జరిపితే.. రేషన్ డీలర్లు బిజినెస్ కరస్పాండెంట్లుగా, బ్యాంక్ మిత్రలుగా వ్యవహరిస్తారు.
- ఏదైనా బ్యాంక్, పోస్టాఫీసుకు చెందిన ఖాతాదారు.. నేరుగా రేషన్ దుకాణంలోకి వెళ్లి డబ్బులు జమచేయడం, విత్‌డ్రా చేసుకోవడానికి అవకాశం ఉంటుంది.
- కొత్త ఖాతాలు ప్రారంభించడం, ఆసరా పింఛన్ డబ్బులు తీసుకునే అవకాశం ఉంటుంది.
- కామన్ సర్వీస్ సెంటర్లలో అందించే ఆధార్, పాన్‌కార్డులు, రైల్వే, విమానం, బస్సు టికెట్ల బుకింగ్ సౌకర్యమూ ఉంటుంది.
- అన్ని రేషన్‌షాపుల్లో ఇది అమలు చేస్తే ప్రజలకు పౌర సేవలు మరింత చేరువయ్యే అవకాశం ఉంటుందని అధికారులు భావిస్తున్నారు.
- బ్యాంకు సేవలు ప్రారంభించేందుకు డబ్బులు డిపాజిట్ చేయాలని అధికారులు సూచించడంతో వాటి నిర్వహణకు రేషన్ డీలర్లు పెద్దగా ఆసక్తి చూపడంలేదని తెలుస్తోంది.

డిపాజిట్ విధానం వద్దు



రేషన్ దుకాణాలు కేవలం బియ్యం పంపిణీకే పరిమితం కావడంతో డీలర్లకు ఆశించిన మేర కమీషన్ రావడంలేదు. దీంతో వారు ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారు. షాపుల్లో బ్యాంక్ సేవలు అందించాలనే నిర్ణయం మంచిదే. ఇందుకోసం డీలర్లు కొంత సొమ్ము డిపాజిట్ చేయాలనడం సరికాదు. డిపాజిట్ లేకుండా అనుమతి ఇవ్వాలి. ఈ దిశగా తక్షణమే చర్యలు తీసుకోవాలి.

– ముంజ జలేందర్, రేషన్ డీలర్ల సంఘం నేత

గ్రామాలకు విస్తరించడం సంతోషకరం



ప్రతీగ్రామంలో రేషన్ దుకాణాలు ఉంటాయి. వాటి ద్వారా బ్యాంక్ సేవలు అందించాలని ప్రభుత్వం నిర్ణయించడం సంతోషకరం. దీంతో పల్లెలకు డిజిటల్ లావాదేవీలు విస్తరిస్తాయి. మారుమూల గ్రామీణులు కూడా ఇతర రాష్ట్రాలు, విదేశాలకు రేషన్ షాపుల్లోనే టికెట్లు బుక్ చేసుకోవచ్చు. కిలోమీటర్ల దూరం వెళ్లే భారం తప్పుతుందని ప్రజల్లో ఆనందం వ్యక్తమవుతోంది.

– బూస రమేశ్, గంభీర్‌పూర్

అవగాహన కల్పిస్తున్నాం



రేషన్ దుకాణాల ద్వారా బ్యాంక్ సేవలు అందించాలని ఇప్పటికే నిర్ణయించాం. దీనిపై డీలర్లకు ఇప్పటికే అవగాహన కల్పించాం. అదనపు కార్యకలాపాల ద్వారా వారికి కమీషన్ రూపంలో అదనపు ఆదాయం లభిస్తుంది. డీలర్లు దరఖాస్తు చేసుకోవాలని సూచించాం. వారు సహకరిస్తే అన్నిరేషన్ దుకాణాల్లో బ్యాంక్ సేవలు అందించేలా చర్యలు తీసుకుంటాం.

– చందన్‌కుమార్, జిల్లా పౌర సరఫరాల అధికారి

అణగారిన వర్గాల ఆశాజ్యోతి 'పూలే'



మాట్లాడుతున్న ఎమ్మెల్యే సంజయ్‌కుమార్, వేదికపై జెడ్పీ చైర్‌పర్సన్ దావ వసంత తదితరులు

- జెడ్పీ చైర్‌పర్సన్ దావ వసంత, ఎమ్మెల్యే సంజయ్, ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి
- మహాత్మా జ్యోతిబాపూలేకు ఘన నివాళి

జగిత్యాలజోన్: అణగారిన వర్గాల ఆశాజ్యోతి జ్యోతిబా పూలే అని జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ దావ వసంత అన్నారు. స్థానిక జెడ్పీ కార్యాలయంలో మంగళవారం జ్యోతిబా పూలే జయంతి నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఆమె మాట్లాడుతూ, బడుగు, బలహీన వర్గాల్లో ఆత్మస్థైర్యం కల్పించి, వారిహక్కుల కోసం పోరాడిన మహనీయుడన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ సీఈవో రామానుజాచారి, ఉద్యోగులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఆయన ఆశయాలు అనుసరణీయం

జగిత్యాలటౌన్: మహాత్మా జ్యోతిబాపూలే ఆశయాలు అనుసరణీయమని ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ అన్నారు. కలెక్టరేట్‌లో బీసీ సంఘం నాయకులతో కలిసి పూలే జయంతి నిర్వహించారు. పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడారు. విద్య ద్వారానే సమాజంలో అణగారిన వర్గాల అభ్యున్నతి సాధ్యమని భావించిన పూలే.. అందుకోసం నిరంతరం శ్రమించారన్నారు. జెడ్పీ చైర్‌పర్సన్ దావ వసంత, అదనపు కలెక్టర్ మకరంద్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ గొల్లపల్లి చంద్రశేఖర్‌గౌడ్, బల్దియా చైర్‌పర్సన్ గోలి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

భారతరత్న ప్రకటించండి



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి

జగిత్యాలటౌన్: తన భార్య సావిత్రీభాయిపూలేను ఉపాధ్యాయురాలిగా తీర్చిదిద్ది మార్పు తన ఇంటినుంచే మొదలుపెట్టిన మహాత్మా జ్యోతిబాపూలే దంపతులకు భారతరత్న ప్రకటించాలని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి కోరారు. స్థానిక ఇందిరా భవన్‌లో మంగళవారం పూలే జయంతి నిర్వహించారు. జ్యోతిబా పూలే ఆశయాలు, ఆలోచనలకు అనుగుణంగా ప్రభుత్వాలు నడుచుకోవాలని జీవన్‌రెడ్డి సూచించారు. తెలంగాణ ఏర్పాటు తర్వాత సీఎం కేసీఆర్ ఆధ్వర్యంలో బలహీన వర్గాల ప్రజాప్రతినిధులతో ప్రత్యేక సమావేశాలు, చర్చలు జరిపి ప్రభుత్వానికి సమర్పించిన నివేదికను బహిర్గతం చేయాలని ఆయన డిమాండ్ చేశారు. డీసీసీ అధ్యక్షుడు అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, నాయకులు కొత్త మోహన్, గిరి నాగభూషణం, బండ శంకర్, కల్లెపెల్లి దుర్గయ్య, గుండ మధు, పుప్పాల అశోక్, నేహాల్, చాంద్‌పాషా పాల్గొన్నారు. కాగా, పోరండ్ల ఉపసర్పంచ్, నాయకులు, యువకులు జీవన్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు.

ప్రాణాలు తీసే పరిశ్రమ వద్దు

- ఇథనాల్ ఫ్యాక్టరీకి వ్యతిరేకంగా పాశిగామ గ్రామస్తుల తీర్మానం



తహసీల్దార్‌కు తీర్మానం కాపీ అందిస్తున్న గ్రామస్తులు

వెల్గటూర్(ధర్మపురి: ప్రజల ప్రాణాల కంటే ఫ్యాక్టరీ ముఖ్యమా అని పాశిగామ గ్రామస్తులు ప్రశ్నించారు. పరిశ్రమ నిర్మాణానికి వ్యతిరేకంగా మంగళవారం గ్రామసభ ఏర్పాటు చేశారు. పరిశ్రమ వద్దంటూ తీర్మానించారు. అనంతరం వెల్గటూర్ తహసీల్దార్ కార్యాలయం వరకు ఏడో నంబరు రాష్ట్ర రహదారి మీదుగా ర్యాలీగా తరలివెళ్లారు. అక్కడ తహసీల్దార్ రమేశ్‌కు తీర్మానం కాపీ అందజేశారు. అనంతరం గ్రామస్తులు మాట్లాడుతూ, ఫ్యాక్టరీ స్థాపనకు వ్యతిరేకంగా 12 రోజులుగా పాశిగామ, స్తంభంపల్లి తదితర గ్రామాల ప్రజలు పోరాటం చేస్తున్నా ప్రభుత్వం మొండిగా వ్యవహరిస్తోందన్నారు. భూగర్భ జలాలు, గాలి కలుషితమవుతాయని, తద్వారా భవిష్యత్ తరాలకు ఆరోగ్య సంబంధిత సమస్యలు తలెత్తే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. అందుకే తాము గ్రామసభ ద్వారా పరిశ్రమ నిర్మాణానికి వ్యతిరేకంగా తార్మానం చేశామని తెలిపారు.

కరపత్రాల కలకలం

మండల కేంద్రంలో 'కాలుష్యం లేని ఇథనాల్ ప్రాజెక్టును నేను – కట్టుకథలు నమ్మకండి' పేరిట గుర్తుతెలియని వ్యక్తులు కరపత్రాలు పంపిణీ చేశారు. వీటిని ఎవరు ముద్రించారు? ఎక్కడ ముద్రించారు? అని పాశిగామ గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు. పరిశ్రమకు వ్యతిరేకంగా శాంతియుతంగా నిరసన చేస్తుంటే, కొందరు రెచ్చగొట్టేలా కరపత్రాలు పంపిణీ చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశబూరు. కరపత్రాలు ముద్రించి, పంపిణీ చేసినవారి ఆచూకీ కావాలని ఎస్సై నరేశ్‌కుమార్‌తో వాదనకు దిగారు. చివరికి ఎస్సై వారిని శాంతింపజేసి తమతమ ఇళ్లకు పంపించి వేశారు.

'ఆరోగ్య మహిళ'పై అవగాహన కల్పించాలి



కొడిమ్యాల పీహెచ్‌సీలో శ్వేతామహంతి తనిఖీలు

కొడిమ్యాల(చొప్పదండి): రాష్ట్రప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఆరోగ్య మహిళ కార్యక్రమంపై గ్రామీణ మహిళలకు అవగాహన కల్పించాలని వైద్య, ఆరోగ్య, కుటుంబ శాఖ కమిషనర్ శ్వేతామహంతి ఆదేశించారు. జిల్లాలోని ఐదు పీహెచ్‌సీల్లో ఆరోగ్య మహిళా కార్యక్రమం నిర్వహిస్తున్నారు. ఇందులో కొడిమ్యాల పీహెచ్‌సీ కూడా ఉంది. ఈ కేంద్రాన్ని శ్వేతామహంతి మంగళవారం తనిఖీ చేశారు. మహిళలకు చేపట్టిన ఆరోగ్య పరీక్షల వివరాలు, ఆన్‌లైన్ డేటా ఎంట్రీ సమాచారం పరిశీలించారు. రెగ్యులర్ టెస్టులతోపాటు అవసరమైనవారికి క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు కూడా చేయాలని సూచించారు. సర్వైవల్ క్యాన్సర్, బ్రెస్ట్‌క్యాన్సర్ వివరాలు కచ్చితంగా నమోదు చేయాలని పేర్కొన్నారు. అల్ట్రాసౌండ్ రేడియోగ్రఫిక్ పరికరాలు అందుబాటులో ఉంచాలన్నారు. ప్రతీ మహిళ పూర్తిస్థాయి ఆరోగ్య సమాచారాన్ని ఆన్‌లైన్ చేయాలని ఆమె సూచించారు.

ముగిసిన టెన్త్ పరీక్షలు



ఆనందం వ్యక్తం చేస్తున్న విద్యార్థులు

కథలాపూర్(వేములవాడ): ఈనెల 3న ప్రారంభమైన పదో తరగతి పరీక్షలు మంగళవారం ముగిశాయి. పరీక్షలు పూర్తిచేసుకున్న విద్యార్థులు ఆనందంతో స్నేహితులకు వీడ్కోలు పలికి తమ ఇళ్లకు చేరుకున్నారు.

నేనే రైతు.. నేనే వ్యాపారి

- వినూత్న రీతిలో సాగు పద్ధతులు
- నేరుగా మార్కెటింగ్ సౌకర్యం
- కర్బూజ సాగులో ఆదర్శ రైతు దంపతులు



కర్బూజలతో రైతు దంపతులు వెంకటేశ్- విజయ

ఆదర్శ సేద్యం



జగిత్యాలలో కర్బూజలు విక్రయిస్తున్న రైతు వెంకటేశ్

జగిత్యాలఅగ్రికల్చర్: ఆ రైతు దంపతులు ప్రయోగాల పురుగులు. చదివింది పదోతరగతే అయినా సాగు పద్ధతులు అవలంబించడంలో శాస్త్రవేత్తలుగా పేరుతెచ్చుకున్నారు. భిన్నంగా ఆలోచించడం.. వినూత్న రీతిలో పంటలు పండించడం, దిగుబడిని నేరుగా కస్టమర్లకు విక్రయించడం వారి ప్రత్యేకత. ఆ యువ రైతు దంపతులే సారంగాపూర్ మండలం పెంబట్ల గ్రామానికి చెందిన బండారి వెంకటేశ్–విజయ.

ఇష్టమైన పంట కర్బూజ..

- వెంకటేశ్ – విజయ దంపతులకు ఇష్టమైన పంట కర్బూజ(వాటర్ మిలన్, పుచ్చకాయ).
- రెండేళ్లుగా తమకున్న మూడు ఎకరాల వ్యవసాయ క్షేత్రంలో పంట పడిస్తున్నారు.
- లేటా నవంబర్ నుంచి మే వరకు పంట కాలంగా ఎంచుకుంటున్నారు.
- పంటను ఒకేసారికాకుండా పలు దఫాలుగా దిగుబడి వచ్చేలా ప్రణాళిక సిద్ధం చేసుకుని పండిస్తారు.
- ముఖ్యంగా, కర్బూజకు అధిక డిమాండ్ ఉండే శివరాత్రి నుంచి వేసవి తీవ్రత అధికంగా ఉండే మే వరకు పంట పండిస్తారు.
- ప్రస్తుతం రోజూ టన్ను నుంచి టన్నున్నర వరకు దిగుబడిని జగిత్యాల మార్కెట్‌కు తీసుకొచ్చి విక్రయిస్తున్నాడు వెంకటేశ్.
- 90 రోజుల్లో చేతికి వచ్చే పంట కావడంతో ఐదారు బ్యాచ్‌లు పంట పండిస్తున్నాడు.
- ఇందుకోసం పలు రకాల విత్తనాలు నాటుతున్నాడు రైతు వెంకటేశ్.

కర్బూజలో ఐదు రకాలు..

ప్రస్తుత వెంకటేశ్ దంపతులు కర్బూజలోనే ఐదు రకాలు పండించారు. ఇందులో ఒకటి సాధారణ(సూపర్‌క్వీన్), రెండోది లోపల పసుపు పచ్చ, బయట ఆకుపచ్చ రంగు ఉండే విశాల్, మూడోది లోపల ఎర్రగా, బయట పసుపు పచ్చగా ఉండే అరోహి, నాలుగోది ఫుట్‌బాల్ మాదిరిగా ఉండే జన్నత్, ఐదోరకం.. మస్క్‌మిలన్(జ్యూస్ రకం) సాగుచేశారు. వీటి విత్తనాలను బెంగళూరు నుంచి తెప్పించారు. విత్తనాలు నాటక ముందు నేలలో కోళ్ల ఎరువు, పశువుల పేడ వేసి, రెండుసార్లు బాగా కలియ దున్నారు. తర్వాత బెడ్ మేకర్‌తో బెడ్ తయారు చేసి, దానిపై కలుపు మొక్కలు రాకుండా మల్చింగ్ షీట్ వేసి, డ్రిప్ ద్వారా నీరు అందిస్తున్నారు. పెద్దగా రసాయన ఎరువులు, పురుగు మందులు పిచికారీ చేయడంలేదు. పురుగులను అదుపులో పెట్టిందుకు సోలార్ ట్రాప్స్, లింగాకర్షక బుట్టలు, ఎల్లోస్టిక్, బ్లూస్టిక్ గమ్ అట్టలు ఉపయోగిస్తున్నారు.

వినూత్నంగా మార్కెట్..

- మూడు నెలలపాటు భార్యాభర్తలు కష్టపడి పంట పండిస్తే.. ఆ పంటను దళారులకు విక్రయిస్తే కిలోకు రూ.5 నుంచి రూ.6 ధర కూడా చెల్లించడంలేదు.
- దీంతో వారు వినూత్న మార్కెట్ పద్ధతులకు తెరలేపారు. భార్య సాయంత్రం తోటకు వెళ్లి కాయలు కోస్తుంది.
- భర్త మరుసటిరోజు ఉదయం ఐదు గంటలకే ఒకరిద్దరు మిత్రుల సాయంతో తోటకు వెళ్లి అప్పటికే కోసిన కాయలను ట్రాక్టర్‌లో లోడ్ చేస్తున్నారు.
- ఉదయం 8 గంటల వరకు జగిత్యాల పట్టణానికి తరలిస్తున్నారు.
- స్థానిక ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల వద్ద అడ్డా ఏర్పాటు చేసుకుని అమ్మకాలు చేస్తున్నారు.
- ఈ సమాచారం సోషల్ మీడియాలో విస్తృత ప్రచారం కావడంతో మంచిగిరాకీ లభిస్తోంది.

నా పంటకు నేనే రాజు

కర్బూజలో ఐదారు రకాలు పండించేందుకు చాలా కష్టపడుతున్నం. ఆ పంట దళారులకు విక్రయిస్తే విత్తనాల ఖర్చు కూడా రావడం లేదు. నా పంటకు నేనే రాజు. మా కష్టానికి తగ్గ ప్రతిఫలం చూసుకుంటున్నం. నేరుగా కస్టమర్లకు అమ్ముతున్నం. ఫేస్‌బుక్, వాట్సాప్ వంటి సోషల్ మీడియాలో ప్రచారం చేస్తున్నం. దీంతో చాలామంది కొనుగోలు చేసేందుకు మొగ్గు చూపుతున్నరు.

– బండారి వెంకటేశ్, రైతు(62818 13273)

ప్రతీ మొక్కను పరీక్షిస్తం

ప్రతీడాది ఆరేడు నెలల పాటు ప్రకృతి వైపరీత్యాలు తట్టుకుని కర్బూజ పంట పండిస్తున్నం. ప్రతి మొక్కను క్షుణ్ణంగా పరిశీలిస్తం. మార్కెట్‌లో డిమాండ్‌ను బట్టి కాయరకం మార్చుతం. విత్తనాల ఖరీదు రూ.వేలల్లో ఉంటుంది. కాబట్టి ఒక్కవిత్తనం కూడా వృథా కాకుండా చూసుకుంటం. భార్యభర్తలం కలిసి పనిచేస్తే వ్యవసాయంలోనే తృప్తి ఉంటుంది.

– బండారి విజయ, రైతు

- ప్రస్తుతం సూపర్ మార్కెట్లలో.. ఆరోహి రకం కర్బూజ కిలో రూ.49 ధర ఉంటే, వెంకటేశ్ రూ.40 ధరతో విక్రయిస్తున్నారు.
- విశాల్ రకం రూ.39 ఉంటే, రూ.30, సూపర్ క్వీన్ రూ.25 ఉంటే రూ.15–రూ.20 వరకు, జన్నత్ రూ.49 ఉంటే రూ.25– రూ.30 వరకు, మస్క్‌మిలన్ రకం కిలో రూ.25– రూ.35 ధర ఉంటే వెంకటేశ్ – విజయ దంపతులు రూ.30 ధరతో నేరుగా కస్టమర్లకు విక్రయిస్తున్నారు.

క్లుప్తంగా

నిరుద్యోగులను మోసం చేస్తున్న ప్రభుత్వాలు



లోగో ఆవిష్కరిస్తున్న రాజమ్మ, తదితరులు

ధర్మపురి: నిరుద్యోగులను మోసం చేస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు ప్రజలు గుణపాఠం చెప్పాలని వైఎస్సార్‌టీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి మోకెనపెల్లి రాజమ్మ అన్నారు. మంగళవారం ధర్మపురి నియోజకవర్గ కేంద్రంలో టీ సేవ లోగో ఆవిష్కరించి మాట్లాడారు. బీజేపీ నియంతృత్వ నిర్ణయాలతో యువతకు కొత్త ఉద్యోగాలు లేవని, అలాగే తెలంగాణ వస్తే ఇంటికో ఉద్యోగం వస్తుందని రాష్ట్ర ప్రభుత్వం ప్రజలను మోసం చేసిందని ఆరోపించారు. రాష్ట్రంలో కొత్త జిల్లాలు, కొత్త మండలాలు ఏర్పాటు చేసిన బీఆర్‌ఎస్ ప్రభుత్వం అందుకు అవసరమైన ఉద్యోగులను నియమించలేదని దుయ్యబట్టారు. బిస్వాల్ కమిటీ ప్రకారం రాష్ట్రంలో ఖాళీగా ఉన్న 1.90 లక్షల ఉద్యోగాలను ప్రభుత్వం భర్తీ చేయాలని డిమాండు చేశారు. సీఎం కేసీఆర్ ఇచ్చిన హామీ ప్రకారం నిరుద్యోగులైన యువతీ, యువకులకు నిరుద్యోగ భృతి చెల్లించాలన్నారు. కార్యక్రమంలో మండల అధ్యక్షురాలు స్వరూపరాణి, కార్యకర్తలు అభిలాష్, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

చికిత్సపొందుతూ డిగ్రీ విద్యార్థి మృతి



మనోజ్(ఫైల్)

కథలాపూర్(వేములవాడ): మండలంలోని గంభీర్‌పూర్ గ్రామానికి చెందిన డిగ్రీ విద్యార్థి యాగండ్ల మనోజ్ (19) చికిత్స పొందుతూ మృతిచెందాడు. గ్రామస్తులు, పోలీసుల వివరాలు.. గంభీర్‌పూర్‌కు చెందిన యాగండ్ల శ్రీనివాస్–సృజన దంపతులకు ఇద్దరు కుమారులు, ఒక కూతురు. పెద్దకుమారుడు మనోజ్ హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ కళాశాలలో డిగ్రీ చదువుతున్నాడు. కళాశాలకు సెలవులు ఉండటంతో మనోజ్ గంభీర్‌పూర్ వచ్చారు. ఈనెల 3న మండలంలోని ఇప్పపెల్లి నుంచి స్వగ్రామానికి బైక్‌పై వస్తుండగా ఇప్పపెల్లి శివారులో అదుపుతప్పి పడిపోయారు. తీవ్రంగా గాయపడిన మనోజ్‌ను హైదరాబాద్‌లోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించగా, చికిత్స పొందుతూ సోమవారం రాత్రి మృతిచెందారు. మృతుడి చిన్నమ్మ వరణ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శ్వేత మంగళవారం పేర్కొన్నారు.

చికిత్స పొందుతూ సాఫ్ట్‌వేర్ ఉద్యోగి..



రాములు (ఫైల్)

కోరుట్లరూరల్: మండలంలోని వెంకటాపూర్ గ్రామానికి చెందిన సాఫ్ట్‌వేర్ ఉద్యోగి జక్క రాములు (28) చికిత్స పొందుతూ మృతిచెందాడు. కుటుంబ సభ్యుల వివరాలు.. రాములు హైదరాబాద్‌లో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తున్నాడు. 15 రోజుల క్రితం అక్కడ జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడటంతో ఆసుపత్రిలో చేర్పించగా మంగళవారం మృతిచెందాడు. రాములు అంత్యక్రియల్లో ఎంపీపీ తోట నారాయణ, టీపీసీసీ నాయకుడు జువ్వాడి కృష్ణారావు పాల్గొని, మృతుడి కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు.

‘గౌరవం’ లేని అంగన్‌వాడీలు

- ఆరు పదుల వయస్సులోనూ తప్పని పరిస్థితుల్లో విధులు
- రిటైర్మెంట్ బెన్‌ఫిట్స్ కల్పించాలని వేడుకోలు



అయితిపల్లిలో విధులు నిర్వహిస్తున్న అంగన్‌వాడీ టీచర్

పెగడపల్లి(ధర్మపురి): చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు ఆరోగ్యపరంగా సలహాలు, సూచనలు ఇస్తూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు వర్తింపజేయడం, సామాజిక కార్యక్రమాల్లో పాల్గొంటున్న వ్యవస్థల్లో అంగన్‌వాడీ ప్రధానమైనది. గ్రామీణులకు పౌష్టికాహారం అందించి శిశుమరణాల రేటు తగ్గించేందుకు కేంద్ర ప్రభుత్వం అంగన్‌వాడీ వ్యవస్థను ప్రారంభించింది. ఆరోగ్య సలహాలు, పోలియో చుక్కలు, ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు సర్వే, ఎన్నికల సంఘం చేపట్టే వివిధ సర్వేలు తదితర వాటిలో వీరే కీలక పాత్ర పోషిస్తున్నారు. కాలానుగుణంగా సిబ్బంది జీతభత్యాలు, నిర్వహణలో మార్పులు వచ్చినా ఉద్యోగ విరమణ అంశంలో మాత్రం ఎలాంటి మార్పు తీసుకురాలేదు. 65 ఏళ్లు దాటినా టీచర్లు, ఆయాలు ఆర్థికపరమైన అవసరాల దృష్ట్యా అవస్థలు పడుతూ విధులకు హాజరవుతున్నామని వాపోతున్నారు. జిల్లా వ్యాప్తంగా 60 ఏళ్లు దాటినా వారు అంగన్‌వాడీ హెల్పర్లు, టీచర్లు కలిపి సుమారు 200 మందికి పైగా ఉన్నారు.

తప్పని పరిస్థితుల్లో..

జిల్లాలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో పనిచేస్తున్న టీచర్లు, హెల్పర్లలో కొంత మంది ఉద్యోగ విరమణ వయస్సు దాటినవారున్నారు. రిటైర్మెంట్ అవకాశం లేక పోవడంతో తప్పని పరిస్థితుల్లో విధులు నిర్వర్తించక తప్పడం లేదు. ఏళ్ల నుంచి పని చేస్తున్నా గౌరవప్రదమైన ఉద్యోగ విరమణ అవకాశం ఇవ్వాలని ప్రభుత్వాన్ని వేడుకుంటున్నారు. స్వయంగా రిటైర్మెంట్ తీసుకోవాలనుకునే అంగన్‌వాడీ టీచర్లకు ప్రభుత్వం గౌరవ పారితోషికంగా రూ.60 వేలు అందజేస్తోంది. హెల్పర్లకు రూ.30 వేలు ఇస్తున్నారు. అనారోగ్య సమస్యలు వెంటాడుతున్నా భారంగా విధులకు హాజరవుతున్నారు. సీఎం కేసీఆర్ ఉద్యోగ విరమణ అవకాశం కల్పించి, రిటైర్మెంట్ బెనిఫిట్స్ కల్పిస్తారని సిబ్బంది ఆశగా ఎదురుచూస్తున్నారు. విరమణ సమయంలో రూ.10 లక్షలు చెల్లించి రిటైర్మెంట్ పింఛన్ అందించాలని కోరుతున్నారు. ఉద్యోగుల క్రమబద్ధీకరణ, కనీస వేతనాలు చెల్లింపు, పింఛన్ సౌకర్యం, టీచర్లతో సమానంగా వేతనం, తదితర సౌకర్యాలు కల్పించాలని ప్రభుత్వాన్ని వేడుకుంటున్నారు.

జిల్లాలో..

అంగన్‌వాడీ ప్రాజెక్టులు	4
కేంద్రాలు	1,065
టీచర్లు	1,010
హెల్పర్లు	950
60 ఏళ్లు దాటిన టీచర్లు, హెల్పర్లు	200

బెన్‌ఫిట్స్ వర్తింపజేయాలి



వయస్సు పైబడినా అంగన్‌వాడీ టీచర్‌గా పని చేస్తున్న. వయసురీత్యా ఇబ్బందులు ఎదురవుతున్నా క్రమం తప్పకుండా తప్పని పరిస్థితుల్లో సెంటర్‌కు వెళ్లి విధులు నిర్వర్తిస్తున్న. ప్రభుత్వం మమ్మల్ని ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి రిటైర్మెంట్ బెనిఫిట్స్ వర్తింపజేస్తే ముందస్తు ఉద్యోగ విరమణ తీసుకోవాలని ఉంది.

– ఉప్పుగండ్ల సీతక్క, అంగన్‌వాడీ టీచర్, అయితిపల్లి

డిమాండ్లు నెరవేర్చాలి



అంగన్‌వాడీ టీచర్లు కోరుతున్న న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం నెరవేర్చాలి. ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తిస్తూ రిటైర్మెంట్ బెన్‌ఫిట్స్ కింద టీచర్లకు రూ.10 లక్షలు, హెల్పర్లకు రూ.6 లక్షలు ఇవ్వాలి. ఇంట్లో అర్హులైనవారుంటే ఒకరికి ఉద్యోగం ఇవ్వాలి. ఇతర సౌకర్యాలు కూడా కల్పించాలి.

– రజిత అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు

నిబంధనల మేరకు..



నిబంధనల మేరకు అంగన్‌వాడీ టీచర్లకు, హెల్పర్లకు బెన్‌ఫిట్స్ ఇవ్వడం జరుగుతుంది. స్వచ్ఛందంగా ఎప్పుడైనా ఉద్యోగ విరమణ చేయవచ్చు. అంగన్‌వాడీ టీచరు, హెల్పర్లకు రిటైర్మెంట్ బెన్‌ఫిట్‌కు సంబంధించి ప్రభుత్వపరంగా ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు. ఈ విషయం ప్రభుత్వ పరిశీలనలో ఉంది.

– డాక్టర్ నరేశ్‌కుమార్, ఐసీడీఎస్ పీడీ

బహిరంగ సభను విజయవంతం చేయాలి



మాట్లాడుతున్న ఆది శ్రీనివాస్

సిరిసిల్లటౌన్: భారత రాజ్యాంగ నిర్మాత బాబా సాహెబ్ అంబేద్కర్ జయంతిని పురస్కరించుకుని ఈనెల 14న మంచిర్యాలలో కాంగ్రెస్ పార్టీ భారీ బహిరంగ సభ నిర్వహించనున్నట్లు పార్టీ జిల్లా అధ్యక్షుడు ఆది శ్రీనివాస్ పేర్కొన్నారు. మంగళవారం సిరిసిల్ల ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. రాహుల్‌గాంధీపై బీజేపీ సర్కారు కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతుందన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించాలని రాహుల్‌గాంధీకి మద్దతుగా నిలవాలన్న లక్ష్యంతో సీఎల్పీ నేత భట్టివిక్రమార్క పాదయాత్రలో భాగంగా మంచిర్యాలలో నిర్వహించే కార్యక్రమానికి జిల్లా నుంచి అన్నివర్గాల ప్రజలు పెద్దెత్తున పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. సభకు ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, ఏఐసీసీ సెక్రెటరీ, తెలంగాణ ఇన్‌చార్జి మాణిక్‌రావు ఠాక్రే, టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి తదితరులు హాజరవుతారని పేర్కొన్నారు. సమావేశంలో టీపీసీసీ సభ్యుడు నాగుల సత్యనారాయణగౌడ్, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు కాముని వనిత, పట్టణ అధ్యక్షుడు సంగీతం శ్రీనివాస్, కళ్యాణ చక్రవర్తి తదితరులు పాల్గొన్నారు.

రాజన్న సేవలో ప్రిన్సిపల్ డైరెక్టర్



స్వాగతం పలుకుతున్న ఆలయ అర్చకులు

వేములవాడ: వేములవాడ రాజన్నను మంగళవారం ప్రిన్సిపల్ డైరెక్టర్ సెంట్రల్ ఆడిట్ అనింద్య దాస్ గుప్తా దంపతులు దర్శించుకున్నారు. ఈసందర్భంగా ఆలయ స్థానాచార్యులు అప్పాల భీమాశంకరశర్మ ఆధ్వర్యంలో అర్చకుల బృందం వారికి ఘన స్వాగతం పలికింది. ఆలయ ప్రదక్షిణలు నిర్వహించిన అనంతరం స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారి దర్శనానంతరం వేదోక్త ఆశీర్వచనంగావించారు. వారి వెంట వీటీడీఏ ఎస్టేట్ ఆఫీసర్ సత్యనారాయణ, ఆలయ పర్యవేక్షకులు శ్రీరాములు, అల్లి శంకర్, అర్చకులు తదితరులు ఉన్నారు.

తప్పుడు ఫిర్యాదుపై రజక సంఘం ఆందోళన



పోలీస్ స్టేషన్ ఎదుట ఆందోళన చేస్తున్న రజక సంఘం సభ్యులు

చొప్పదండి: పట్టణంలోని రజక సంఘం సభ్యులు స్థానిక పోలీస్‌స్టేషన్ ఎదుట మంగళవారం నిరసన వ్యక్తం చేశారు. రజక సంఘం ఆధ్వర్యంలో గత ఆదివారం నుంచి మడేలయ్య బోనాలు నిర్వహిస్తున్నారు. మంగళవారం బోనాలు మడేలయ్య గుడికి తీసుకువెళ్లే సమయంలో పోలీసులు కులంపెద్దలను స్టేషన్‌కు రావాలని కోరారు. ఒక కుటుంబ సభ్యులు కులబహిష్కరణ చేశారని ఫిర్యాదు చేశారని చెప్పడంతో కులసభ్యులంతా బోనాల కార్యక్రమం వదిలేసి పోలీస్‌స్టేషన్‌కు తరలివచ్చారు. బోనాల కార్యక్రమానికి ఆటంకం కలిగించే ఉద్దేశంతో పోలీసులకు తప్పుడు సమాచారం అందించడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. చేయని తప్పుకు కులపెద్దలపై అపవాదులు వేయడానికి పలువురు మద్దతు పలకడంపై విస్మయం వ్యక్తం చేశారు. బోనాల కార్యక్రమం ఉండటంతో పోలీసులు రజక సంఘం సభ్యులను స్టేషన్ నుంచి పంపించారు.

గంజాయి కేసులో నిందితుడిపై పీడీయాక్టు



పీడీయాక్టు ఉత్తర్వులు అందిస్తున్న సీఐ విజ్ఞాన్‌రావు

కరీంనగర్‌క్రైం: ఆదిలాబాద్, మహారాష్ట్రలోని చంద్రాపూర్ ప్రాంతం నుంచి కరీంనగర్‌కు గంజాయి తీసుకొచ్చి యువతకు అమ్ముతున్న నిందితుడిపై కరీంనగర్ రూరల్ పోలీసులు పీడీయాక్టు అమలు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... కొత్తపల్లి మండలం రేకుర్తికి చెందిన షేక్ ఉస్మాన్(44) ఇతర రాష్ట్రాలు, ప్రాంతాల నుంచి గంజాయి తీసుకొచ్చి, అమ్మకాలు జరుపుతూ అరెస్టు అయ్యాడు. గతేడాది అక్టోబర్ 28 తేదిన అరెపల్లి గ్రామ శివారులో గంజాయి అమ్ముతూ పట్టుబడగా అరెస్టు చేసి జైలుకు తరలించారు. గంజాయి అమ్మకాలు చేస్తూ యువత, అమాయకుల ప్రాణాలకు ముప్పు కలిగిస్తున్న నిందితుడు షేక్ ఉస్మాన్‌పై మంగళవారం పీడీయాక్టు అమలు చేశారు. ఉస్మాన్‌కు కరీంనగర్ రూరల్ సీఐ విజ్ఞాన్‌రావు పీడీయాక్టు ఉత్తర్వులు అందచేసి చర్లపల్లి సెంట్రల్ జైలుకు తరలించారు. ఈ సందర్భంగా సీఐ విజ్ఞాన్‌రావు, పీడీసెల్ ఇన్‌చార్జి పండరీలను సీపీ సుబ్బారాయుడు అభినందించారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): మండల కేంద్రం శివారులోని లక్ష్మీ కేశవ పెరుమాండ్లస్వామి గుట్ట వద్ద మంగళవారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురు విద్యార్థులు గాయపడ్డారు. ఎల్లారెడ్డిపేటకు చెందిన కటుకం సాత్విక్, శివశంకర్, లింగాపూర్ సూర్యతేజ పదోతరగతి చదువుతున్నారు. మంగళవారం చివరి పరీక్ష రాసిన వారు గంభీరావుపేటలోని స్విమ్మింగ్‌పూల్‌లో ఈత కొట్టేందుకు వెళ్లారు. సాయంత్రం తిరిగి వస్తుండగా మండల కేంద్రం శివారులోని లక్ష్మీ కేశవ పెరుమండ్లస్వామి గుట్ట సమీపంలో వారి బైక్ అదుపుతప్పింది. ముగ్గురు విద్యార్థులు గాయపడ్డారు. వీరిని స్థానిక ప్రైవేటు ఆస్పత్రికి తరలించగా.. వైద్యం అందిస్తున్నారు. వారు ప్రస్తుతం క్షేమంగా ఉన్నారు.

మలేషియాలో సీతారాంనాయక్ వాసి మృతి

వీర్నపల్లి(సిరిసిల్ల): మండలంలోని సీతారాం నాయక్ తండా గ్రామానికి చెందిన బానోత్ బావుసింగ్ (48) ఈ నెల 7న మలేషియాలో అనారోగ్యంతో మృతిచెందినట్లు గ్రామస్తులు తెలిపారు. పొట్టకూటి కోసం మలేషియా వెళ్లి మృతిచెందిన బావుసింగ్ మృతదేహాన్ని స్వదేశానికి తెప్పించాలని స్థానిక ప్రజాప్రతినిధులు మంత్రి కేటీఆర్‌కు విన్నవించారు. మంత్రి చొరవతో రాష్ట్ర కార్యదర్శి మలేషియాలోని భారత దౌత్య కార్యాలయానికి లేఖ రాశారు. త్వరలోనే బావుసింగ్ మృతదేహం స్వదేశానికి చేరనున్నట్లు సమాచారం.

తాళం వేసి ఉన్న ఇళ్లే టార్గెట్

- నీలోజిపల్లిలో వరుస చోరీలు
- వ్యవసాయదారుల ఇళ్లపై కన్ను
- భయాందోళనలో ప్రజలు



ఇటీవల నీలోజిపల్లి చోరీ సంఘటనలో ఎస్సై మహేందర్ విచారణ

బోయినపలి(చొప్పదండి): తాళం వేసి ఉన్న ఇళ్లనే దొంగలు టార్గెట్ చేస్తున్నారు. తాళాలు పగులగొట్టి ఇళ్లలోకి చొరబడి అందినకాడికి ఎత్తుకెళ్తున్నారు. ప్రధానంగా వ్యవసాయకుటుంబాల ఇళ్లే లక్ష్యంగా చోరీలకు పాల్పడుతున్నారు. వ్యవసాయ కుటుంబాలలో పొద్దాంత పొలాల వద్ద పనుల్లో బిజీగా ఉంటుండడంతో దొంగలకు కలిసొస్తుంది. చుట్టుపక్కల వారు సైతం పక్కింట్లో ఎవరూ ఉంటున్నారనే విషయాన్ని సైతం పట్టించుకోకపోవడంతో దొంగలకు అవకాశంగా మారింది. వరుసచోరీలతో బోయినపల్లిలో మండలంలోని పునరావాస గ్రామాల ప్రజలు భయాందోళన చెందుతున్నారు.

రెచ్చిపోతున్న దొంగలు

- బోయినపల్లి మండలంలోని నీలోజిపల్లికి చెందిన తిమ్మాపురం సతీశ్ ఇంట్లో గత ఫిబ్రవరి 3న దొంగలు పడ్డారు. 8 తులాల బంగారం, నగదును ఎత్తుకెళ్లారు.
- తిమ్మాపురం గ్రామానికి చెందిన అనుముల మహేందర్ ఇంట్లో ఏప్రిల్ 9న చొరబడిన దొంగలు బీరువా పగులగొట్టి నాలుగు తులాల బంగారు నగలు, వెండి ఆభరణాలను ఎత్తుకెళ్లారు.
- మార్చి 15న అనంతపల్లికి చెందిన మల్లారెడ్డి ఇంట్లో ప్రవేశించిన అగంతకులు 12 తులాల బంగారం ఆభరణాలను చోరీ చేశారు.
- అనంతపల్లికి చెందిన మల్లారెడ్డి ఇంట్లో రాత్రి సమయంలో దొంగతనానికి పాల్పడ్డారు.
- గతేడాది మార్చిలో మండలంలోని గుండన్నపల్లి అనుబంధ గ్రామం ఎన్నంపల్లిలో వేములవాడ వెళ్లే బీటీ రోడ్డును ఆనుకునే ఉన్న ఎన్నం అనంతరెడ్డి ఇంట్లో పట్టపగలు దొంగతనానికి పాల్పడ్డారు. 17 తులాల మేర బంగారు నగలు, నగదు మాయమైంది.
- రెండు నెలల క్రితం కొదురుపాక రేణుక ఎల్లమ్మ ఆలయంలోనూ దొంగలు పడ్డారు.
- బోయినపల్లి మండలం నీలోజిపల్లి, ఎన్నంపల్లి గ్రామాల్లో రైతుల ఇళ్లలోనే చోరీలు జరుగుతున్నాయి. రైతులు పొలం పనులకు వెళ్లిన సమయంలో చోరీలు చేయడం గమనార్హం. నీలోజిపల్లి గ్రామంలో గతంలో సైతం ఇద్దరు రైతుల ఇళ్లలో పట్టపగలు ఇళ్ల తాళాలు పగులకొట్టి చోరీలకు పాల్పడ్డట్లు గ్రామస్థుల ద్వారా తెలిసింది. ఇళ్ల ముందు పెట్టుకున్న బైక్‌లు, రైతుల మోటార్లు సైతం పలు గ్రామాల్లో చోరీ జరిగిన సందర్భాలు ఉన్నాయి.

దొంగలను పట్టుకున్నా ఆగని చోరీలు

బోయినపల్లి మండలంలోని నీలోజిపల్లిలో ఫిబ్రవరి 3న జరిగిన చోరీలో ఇద్దరు దొంగలను, గతేడాది మార్చి 12న ఎన్నంపల్లి చోరీ కేసులోనూ దొంగను వేములవాడ డీఎస్పీ నాగేంద్రచారి, రూరల్ సీఐ బన్సీలాల్ ఆధ్వర్యంలో పోలీసులు పట్టుకున్నారు. చోరీ కేసుల్లో దొంగలను పోలీసులు పట్టుకున్నప్పటికీ దొంగతనాలు ఆగడం లేదు. వరుస చోరీలు జరుగుతుండడంతో ప్రజలు భయాందోళన చెందుతున్నారు.

పెట్రోలింగ్ ముమ్మరం చేస్తున్నాం



చోరీలను అరికట్టేందుకు రాత్రి, పగలు పెట్రోలింగ్ ముమ్మరం చేశాం. వాహనాల తనిఖీ సైతం పెంచాం. వివిధ ప్రాంతాల్లో హఠాత్తుగా తనిఖీలు చేపడుతున్నాం. అనుమానితుల ఫింగర్ ప్రింట్స్ సేకరిస్తున్నాం. ప్రజలు సైతం అప్రమత్తంగా ఉండాలి. అనుమానితుల కదలికలు ఉంటే పోలీసులకు సమాచారం అందించాలి.

– మహేందర్, బోయినపల్లి, ఎస్సై

ఆయిల్‌పామ్‌పై రైతన్న ఆసక్తి

- అవగాహన కల్పించడంతో సాగుకు ముందుకొస్తున్న అన్నదాతలు
- ఎకరాకు 10–12 టన్నుల దిగుబడి
- ఉద్యానశాఖ అధికారి ప్రతాప్‌సింగ్



ప్రతాప్‌సింగ్, జిల్లా ఉద్యానశాఖ అధికారి



రైతు పొలంలో ఆయిల్‌పామ్ సాగు

గొల్లపల్లి(ధర్మపురి): ఆయిల్‌పామ్ సాగుతో కలిగే లాభాలపై అధికారులు అవగాహన కల్పిస్తుండడంతో పంటను సాగు చేసేందుకు రైతులు ఆసక్తి చూపుతున్నారు. పంట సాగుకు ప్రభుత్వం రాయితీ కూడా ఇస్తుండడంతో ముందుకొస్తున్నారు. ఆయిల్‌పామ్‌తో కలిగే లాభాలు, సాగు వివరాల గురించి జిల్లా ఉద్యానశాఖ అధికారి ప్రతాప్‌సింగ్ పలు విషయాలు వివరించారు.

9వేల ఎకరాలు లక్ష్యం..

గొల్లపల్లి మండలం అబ్బాపూర్‌లో లోహియా ఎడిబుల్ ఆయిల్స్ (గోల్డ్ డ్రాప్ కంపెనీ)వారు 55 ఎకరాల్లో ఆయిల్ పామ్ నర్సరీ ఏర్పాటు చేశారు. 2022–23 సంవత్సరంలో జిల్లాలో 9వేల ఎకరాల్లో సాగు లక్ష్యం ఏర్పర్చుకోగా ఇప్పటి వరకు రైతుల నుంచి 4,600 దరఖాస్తులు వచ్చాయి. వీరికి జూన్‌లో మొక్కలు ఇచ్చేందుకు సిద్ధం చేస్తున్నారు.

సాగు చేస్తున్న వంగడం..

టెనెరా హైబ్రిడ్.. ప్రపంచం మొత్తం మీద పండించే ఏకైక వంగడం. ఎక్కువ నూనె శాతం కలిగి ఉంటుంది. ఏ కాలంలోనైనా ఈ మొక్కల్ని నాటవచ్చు. జూన్ నుంచి డిసెంబర్ మధ్య కాలం అనుకూలం. వేసవిలోనాటితే ఎండను తట్టుకునేలా నీరు అందించాలి. మల్చింగ్ లేదా మొక్క పల్లాల్లో కవర్ చేయుట మంచిది. 12 నుంచి 14 నెలల వయస్సు కలిగి 1–1.3 మీటర్ల ఎత్తు, 13 ఆకులతో ఆరోగ్యంగా ఉన్న మొక్కలు నాటాలి. హెక్టారుకు 143, ఎకరాకు 57 మొక్కలు సరిపోతాయి. 60 సెం.మీ పొడవు, వెడల్పు లోతులో గుంతలు తీసి, 9 మీటర్ల ఎడం ఉండేలా త్రిభుజాకారంలో నాటాలి.

నీటి యాజమాన్యం..

సీజన్‌ను బట్టి పాదుల్లో తగినంత తేమ ఉండేలా నీరు అందించాలి. నీటి కొరత వల్ల ఆకుల ఉత్పత్తి తగ్గి, పెరుగుదల సన్నగిల్లి తదుపరి కాలంలో మగ పుష్పాలు వచ్చి దిగుబడి తగ్గి పోతుంది. మూడేళ్లు పైబడిన మొక్కకు వర్షాకాలంలో సుమారు 100–150 లీటర్ల నీటిని రోజూ అందించాలి. వేసవిలో ఎండ తీవ్రత అధికంగా ఉండి వడగాల్పులు ఉంటే 300–350 లీటర్ల నీటిని అందించాలి. డ్రిప్ విధానంలో నీరు అందించడం ఉత్తమమైన పద్ధతి.

ఎరువుల యాజమాన్యం

మొక్క వయస్సు బట్టి మొదటి సంవత్సరం ఒక్కో మొక్కకు నత్రజని 870 గ్రా. లేదా అమ్మోనియం సల్ఫేట్ 2వేల గ్రాములు, భాస్వరం సింగిల్ పాస్ఫేట్ రూపంలో 1,250 గ్రా., పొటాష్ 667 గ్రా., బోరాన్ 25 గ్రా. వేయాలి. రెండో సంవత్సరం నత్రజని 1,400 గ్రా., భాస్వరం 870 గ్రా., పొటాష్ 2వేల గ్రా., మెగ్నిషియం సల్ఫేట్ 250 గ్రా., బోరాన్ 100 గ్రా. అందించాలి. మూడో సంవత్సరం నత్రజని 2,100 గ్రా., భాస్వరం 1,305 గ్రా., పొటాష్ 2వేల గ్రా., మెగ్నీషియం సల్ఫేట్ 500 గ్రా., బోరాన్ 100 గ్రా. వేయాలి. మూడో సంవత్సరంలో సిఫారసు చేసిన ఎరువులను నాల్గో సంవత్సరం కూడా వేయాల్సి ఉంటుంది.

గెలల దిగుబడి

గెలల దిగుబడి నాల్గో సంవత్సరం నుంచి ప్రారంభమవుతుంది. కానీ దిగుబడి నిలకడగా రావడం ఏడో సంవత్సరం నుంచి ప్రారంభమై ఎకరానికి సగటున 10–12 టన్నుల దిగుబడి వస్తుంది. పక్వానికి వచ్చిన గెలలు మాత్రమే కోయాలి. పూర్తిగా ఎదిగిన చెట్టు 15–18 మీటర్ల వరకు ఉంటుంది. నాటిన నాల్గో ఏడాది నుంచి 25 ఏళ్ల వరకు దిగుబడినిస్తుంది. అన్ని ఖర్చులు పోనూ ఎకరాకు ఏడాదికి రూ.1.30 లక్షల ఆదాయం ఉంటుంది.

ప్రభుత్వ రాయితీ..

ఆయిల్‌పామ్ సాగుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక రాయితీ సౌకర్యం కల్పించింది. ఒక మొక్క రూ.20 లభిస్తుంది. అంతర పంటల సాగుకు ఎరువులు నిమిత్తం ఎకరాకు రూ.4,200 చొప్పున నాలుగేళ్ల వరకు రూ.16,800 నేరుగా రైతుల ఖాతాలో జమచేస్తుంది. అర్హులైన రైతులకు 80 నుంచి 100 శాతం రాయితీపై బిందు సేద్య పరికరాలు అందిస్తారు.

తొమ్మిది ఎకరాల్లో సాగు చేశా..



ఆయిల్‌పామ్ సాగుతో లాభాలపై అధికారులు అవగాహన కల్పించడంతో ఇటీవలే 9 ఎకరాల్లో సాగు చేశా. సాగుకు అవసరమైన డ్రిప్పులు కూడా ప్రభుత్వమే ఇస్తుంది. నాలుగేళ్ల వరకు అంతర పంట వేసుకోవచ్చు.

– దామోదర్‌రావు, రైతు, బొంకూర్

కుక్కల దాడిలో చిన్నారికి గాయాలు



గాయపడిన చిన్నారి

ధర్మపురి: ధర్మపురి పట్టణంలో మంగళవారం మూడేళ్ల వయస్సు గల చిన్నారి ఇంటి ముందు ఆడుకుంటుండగా కుక్కలు దాడి చేశాయి. చిన్నారి కాలు, చేతికి గాయాలయ్యాయి. వెంటనే ధర్మపురిలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ధర్మపురిలో కుక్కల బెడద రోజురోజుకు పెరిగిపోతుంది. మున్సిపల్ అధికారులకు పలుమార్లు తెలిపినా పట్టించుకోవడం లేదని పట్టణ ప్రజలు ఆరోపిస్తున్నారు.

గుర్తుతెలియని మృతదేహం

బోయినపల్లి(చొప్పదండి): మిడ్‌మానేరు ప్రాజెక్టు పరిసరాల్లో మంగళవారం గుర్తుతెలియని మృతదేహం లభ్యమైంది. పోలీసుల వివరాలు.. కొదురుపాక పాత రోడ్డు పరిసరాల్లోని ప్రాజెక్టులో గుర్తు తెలియని పురుషుడి మృతదేహం ఉందనే సమాచారంతో మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ ప్రభాకర్ వెళ్లి పరిశీలించారు. వెంటనే పోలీసులకు సమాచారం అందించాడు. ఎస్సై మహేందర్ ఆధ్వర్యంలో పోలీసులు ఘటనా స్థలాన్ని సందర్శించి విచారణ చేపట్టారు. మృతుడి వయస్సు సుమారు 35 ఏళ్లు ఉంటుందని తెలిపారు. మృతదేహం కుళ్లిపోయి గుర్తుపట్టలేని విధంగా ఉంది. మృతదేహాన్ని గుర్తుపట్టిన వారు 87126 56418 నంబర్‌లో సంప్రదించాలని పోలీసులు తెలిపారు. ఆర్‌ఐ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నారు.